వెనక్కి తిరిగి చూసింది అరుణ. పైనున్న రాడ్‌ని పట్టుకుని నిల్చుని ఉన్నాడు ఒక యువకుడు. ఆమె చూసింది అతడికోసమే. బస్సు ఎక్కేటప్పుడు గమనించింది అతన్ని. నున్నగా షేవ్ చేసిన మొహంతో, కళ్ళద్దాలతో, టీషర్ట్, జీన్స్ పాంట్‌తో ఆధునిక యువతకు ప్రతీకలా ఉన్నాడు.

అరుణకు చాలాకాలం నుంచి ఒక ఊహ ఉంది. మాటల్లో, చేతల్లో ఆధునికతను కనబరుస్తూ, మామూలు వ్యక్తులకంటే భిన్నంగా ఉంటే అలాంటి ఒక అబ్బాయితో స్నేహం చేయాలనీ, అతనితో తన ఆలోచనలు పంచుకోవాలనీ ఆమె కోరిక.

దురదృష్టంకొద్దీ ఆమె క్లాస్‌మేట్స్‌లో అలాంటివారు ఎవరూ లేరు. అంతే ఆమెకంటే చాలా పెద్దవాళ్ళు, ఇంతలావు మీసాలు గడ్డాల్తో రఫ్‌గా, ఏ అమ్మాయి ట్రాప్ చెయ్యడానికి దొరుకుతుందా అని వెదుకుతుంటారు. ద్వంద్వార్థాలతో మాట్లాడటం, వెకిలి కామెంట్స్ చేయడమే వారి ప్రవృత్తి.

చెరువు దగ్గర కొంగల్లా, శవం దగ్గర నక్కల్లా ఉండే అలాంటి క్లాస్‌మేట్స్‌వైపు చూడ్డానికి కూడా ఇష్టపడేది కాదు.

మళ్ళీ తలతిప్పి చూసింది. అతను కిటికీలోంచి బయటకు చూస్తున్నాడు.

''పాపం చాలా సేపట్నించీ నించునే ఉన్నాడు... అతని దగ్గరే ఎవరో అమ్మాయి ఉంది... వాళ్ళిద్దరూ తాకుతున్నట్లుగా ఉన్నారు. అతనేం పట్టించుకున్నట్లుగా లేడు. మంచివాడే. ఇంకొకరు ఎవరైనా అయితే ఆ అమ్మాయిపై ఒరిగిపోతూ ఉండేవాళ్ళు... ఏం చదువుతున్నాడో... ఇంజనీరింగా... మెడిసిన్... కంప్యూటర్... గర్ల్‌ఫ్రెండ్ ఎవరైనా ఉంటుందా... ఉండొచ్చు... ఉండొచ్చు. ఏమిటి ఉంటుంది. అలాంటి అబ్బాయిని ఇష్టపడని అమ్మాయి ఎవరైనా ఉంటుందా?...''

ఏదో అసూయగా అనిపించింది అరుణకి.

''ఛ... ఇలా ఆలోచిస్తున్నానేమిటీ... తనకి అతనిపై ఉన్నది ప్రేమ.. దోమ... సెక్స్ లాంటి ఆలోచనలు కాదు. ఏదో తెలియని అనురాగం. మనకన్నా చిన్నవాళ్ళమీద.. చిన్న పిల్లలమీద ఉండేలాంటిది... ఎస్... తనకి చెల్లెలో, తమ్ముడో ఉంటే ఇలాంటి ఫీలింగే ఉండేది...''

మళ్ళీ వెనక్కి తిరిగి చూసింది.

''అరె ఎక్కడ? ఆ అటువైపు వరుసలో కూర్చున్నాడు. అరే ఇటే చూస్తున్నాడు. తను చూడగానే తల తిప్పుకున్నాడు. అంటే తను అతనివైపు చూడనపుడు అతను తననే చూస్తున్నాడా?''

అరుణ శరీరంలో సన్నని ప్రకంపన.

''ఏమిటీ వణుకు... ఆపోజిట్ సెక్స్ మీద ఉండే ఫీలింగా... ఛ... అలా కాదు. ఆ అబ్బాయి తనకంటే చిన్నవాడు. తనకో తమ్ముడు ఉంటే ఇలాగే ఉండేవాడు. తను వాడిని ఇలాగే పెంచేది. స్మార్ట్‌గా... హాండ్సమ్‌గా... ఇంటలిజెంట్‌లా... ఇలాగే ఉండేవాడేమో... అవునూ... ఎక్కడైనా దిగిపోలేదు కదా!?...''

మళ్ళీ వెనక్కి తిరిగి చూసింది.

''హమ్మయ్య! ఉన్నాడు. తనవైపే చూస్తున్నాడు. ఛ... తను అతన్ని గమనిస్తున్నట్లు తెలిసిపోయింది. ఆ... తెలిస్తే తెలిసింది లెస్తూ... అతనేమైనా వచ్చి అడుగుతాడా ఎందుకు చూస్తున్నావూ అని. అవునూ... వచ్చి మాట్లాడితే... ప్చ్ ఆ అవకాశం లేదు. అతనెవరో... తానెవరో... ఏదైనా మిరకల్ జరిగి మాటలాడే అవకాశం వస్తే... అయ్యో ఇంక లాస్ట్ స్టాప్ వచ్చేస్తోంది. ఒకవేళ అతనిదీ మన స్ట్రీటే అయితే బావుంటుంది...''

బస్సాగడంతో అరుణ కూడా తన ఆలోచనలు ఆపి బస్సు దిగింది. తిరిగి చూసింది. అతను బస్సు దిగుతున్నాడు. అతను చూస్తాడేమోనని చటుక్కున తల తిప్పేసుకుని ముందుకు అడుగులు వేసింది. తన స్ట్రీట్ మలుపు తిరిగి మళ్ళీ వెనక్కి చూసింది. కాస్తంత సర్‌ప్రైజ్... అతనిదీ ఈ స్ట్రీటే. ఆమెకు సంతోషమేసింది. అతనితో పరిచయం లేకపోతే పోయింది. కనీసం అప్పుడప్పుడు చూడొచ్చు.

# అతనే...

**-పి.వి.రామారావు**



ఉన్నట్టుండి కిందపడబోయి నిలదొక్కుకుంది.

''ఛ... ఈ చీకట్లో గుంట కనబడలేదు...'' అనుకుంది.

రోజూ ఉండే చీకటే కానీ మనుషులు ఎవరూ లేకపోవడంతో కాస్తంత భయం వేస్తోంది.

''అయినా తనపిచ్చికానీ వెనక అతను ఉన్నాడుగా... ఉన్నాడా... తన ఇల్లు వచ్చేసి వెళ్ళిపోయాడా...'' మళ్ళీ వెనక్కి తిరిగి ఓరకంట చూసింది.

''అయ్ బాబోయ్! తనవెనకే... దగ్గరే ఉన్నాడు. నాలుగడుగుల దూరంలో... అతని నడక చాలా ఫాస్ట్‌గా ఉంది. బస్సు దిగినప్పుడేమో చాలా దూరంలో ఉన్నాడు. ఇంతకీ అతని ఇల్లు... అరె ఏమిటిది... నడుం దగ్గర... చెయ్యా?!... చెస్ట్ దగ్గర కూడా... వెనక్కి లాగుతున్నారు. వెనక ఎవరో హత్తుకున్నట్లు... చెంపమీద తడి... పెదవుల తడి... ఎవరో తనని పట్టుకున్నారు?! పట్టు సడలించారు...'' గబుక్కున వెనక్కి తిరిగింది.

ఆమెకు ఏం అనుకోవడానికీ అవకాశం ఇవ్వకుండా ఆశ్చర్యంలో ముంచి వెళ్ళిపోతున్నాడు.

''అతనే... అతనే...''

★




